క్లుప్తంగా

ముమ్మరంగా ఆలయ నిర్మాణ పనులు



ఆలయ నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

పెనగలూరు : మండలంలోని ఈటమాపురం గ్రామంలో పురాతనస్వామి భరద్వాజ స్వామి ఆలయ ప్రాంగణంలో నూతన ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. శిథిలావస్థలో ఉన్న ఆలయాన్ని తొలగించారు. ఈటమాపురం ప్రముఖ పారిశ్రామిక వేత్త బత్తిన గుండాల్ రెడ్డి ఈ నూతన ఆలయ నిర్మాణానికి రూ. 12 లక్షలు డిపాజిట్ చేసి రూ. 60 లక్షలు నిధులను ఎండోమెంట్ ద్వారా మంజూరు చేయించారు. ఆలయ నిర్మాణ పనులను ఈటమాపురానికి చెందిన మన్నూరు అమర్నాథరెడ్డి చేయిస్తున్నారు. పనులను వేగవంతంగా చేసి ఆలయాన్ని త్వరగా నిర్మించేందుకు కృషి చేస్తామని గుండాల్ రెడ్డి, బత్తిన తిరుపాల్ రెడ్డిలు తెలిపారు.

మట్టి ట్రాక్టర్లు స్వాధీనం

సంబేపల్లె : అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ షరీఫ్ ఆదివారం తెలిపారు. శనివారం రాత్రి మండల పరిధిలోని మోటకువాండ్ల పల్లె క్రాస్ సమీపంలో ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందిందన్నారు. వెంటనే తమ సిబ్బందితో వెళ్లి ట్రాక్టర్లతో పాటు జేసీబీలను అదుపులోకి తీసుకొన్నామన్నారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులకు అప్పజెప్పినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు పనుల ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ తదితరులు

వీరబల్లి : మండల పరిధిలోని గుర్రప్పగారిపల్లె గ్రామం మాదిరెడ్డిగారిపల్లె సమీపాన వెలసిన వీరనాగమ్మ ఆలయం వద్ద గ్రావెల్ రోడ్డు పనులను ఆదివారం ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. కొన్ని రోజులలో జాతర దృష్ట్యా రోడ్డు వేస్తున్నట్లు ఎంపీపీ అన్నారు. జాతరకు వచ్చే పట్టాదారులు కోసం రోడ్డు సక్రమంగా లేకపోవడం వలన ఈ రోడ్డును ఆ గ్రామ ప్రజల కోరిక మేరకు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గాలివీటి విజయభాస్కర్ రెడ్డి, సర్పంచ్ విజయలక్ష్మి, నాయకులు శ్రీరాములు రెడ్డి, నారాయణరెడ్డి, సుబ్బరామరాజు, మదన్, కసిరెడ్డి లక్ష్మిరెడ్డి, వీరనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



చంద్రమౌళికి నగదు అందజేస్తున్న దృశ్యం

రాయచోటి టౌన్ : రోడ్డు ప్రమాదంలో లక్కిరెడ్డిపల్లెకు చెందిన చంద్రమౌళి కాలును కోల్పోయాడు. బాధిత కుటుంబానికి చేయూత అందించాలని తలంపుతో రాయచోటి జిన్నా సేవా సంస్థ అధ్యక్షుడు జిన్నా షరీఫ్‌రూ.10 వేల నగదును అందజేశాడు. గత నెలలో గువ్వల చెరువు ఘాట్‌లో తన భార్యతో కలసి కడపకు వెళ్తుండగా లారీ ఢీకొన్న సంఘటనలో ఆయన కాలు విరిగిపోవడంతో మంచానికే పరిమితయ్యాడు. భవిష్యత్తులో జీవనోపాధికి కూడా తన వంతుగా సహకరిస్తానని షరీఫ్ హామీ ఇచ్చాడు.

ఘనంగా అబ్రహాం లింకన్ జయంతి

వాల్మీకిపురం : అమెరికా 16వ అధ్యక్షుడు అబ్రహాం లింకన్ జయంతిని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక బీసీ హాస్టల్‌లో విద్యార్థులతో కలసి అబ్రహాం లింకన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేవీవీ అధ్యక్షుడు ప్రభుచరణ్ మాట్లాడుతూ అబ్రహాం లింకన్ అమెరికాను అప్పట్లో నడిపించిన తీరు ప్రపంచ వ్యాప్తంగా ఇతర దేశాల్లో ప్రజాస్వామ్య నిర్మాణానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. కటిక పేదరికం నుంచి చదువుకొని అమెరికా అధ్యక్షుడు స్థాయికి ఎదిగారన్నారు. కార్యక్రమంలో వార్డెన్ భారతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ

కలకడ : మహాశివరాత్రి ఉత్సవాలకు ఆదివారం కలకడ శ్రీకామాక్షిసమేత సిద్దేశ్వర స్వామి ఆలయంలో అంకురార్పణ చేశారు. 11 రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కేసర్ల అఖిలేష్ తెలిపారు. సోమవారం ధ్వజా రోహణం, మంగళవారం రావణ వాహనం, బుధవారం హంస వాహనం, గురువారం మయూర వాహనం, శుక్రవారం కల్యాణ మహోత్సవం, గజవాహనంపై అలంకరణ ఉంటుందని చెప్పారు. అలాగే శనివారం ఖరదీపము, లక్షబిల్వార్చన, ఆదివారం యాళివాహణం, 20వ తేదీ త్రినేత్ర దారణ, 21 వసంతోత్సవం, 22న పార్వేట, 23న ధ్వజఅవరోహణంతో ఉత్సవాలను ముగించనున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పెరటి సాగు.. సేంద్రియంతో బాగు

ఓబులవారిపల్లె : ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరలు అధికంగా ఉండటంతో పట్టణాలకు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేయడం వ్యయ ప్రయాసాలతో కూడుకున్న పని. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు పెరటి కూరగాయల పెంపకంపై మక్కువ చూపుతున్నారు. మండలంలోని చెన్నరాజుపోడు, గాదెల కొత్తపల్లి తదితర గ్రామాలలో ఇంటి ఆవరణలో పెరటి కూరగాయల పెంపకం సాగు చేస్తూ మహిళలు లబ్ధి పొందుతున్నారు. టమాట, వంగ, బెండ, చిక్కుడు, కాకరకాయ, కొత్తిమీర, పుదీన, పాలకూర తదితర ఆకుకూరలను సాగు చేస్తున్నారు. తాము పండించిన పంటలను తమ కుటుంబ అవసరాలకు, ఇరుగుపొరుగు వారికి, బంధువులకు ఇస్తున్నారు. కొంతమంది మహిళలు ఇంటి అవసరాలతోపాటు ఇతరులకు విక్రయించి ఆదాయం పొందుతున్నారు. మార్కెట్‌లో లభించే కూరగాయలలో అధికంగా రసాయన ఎరువులతో పండించినవి దొరుకుతుంటాయి. ఆ కూరగాయలు ఆరోగ్యానికి హానికరమని వ్యవసాయ అధికారులు తెలిపారు. సేంద్రియ పద్ధతిలో కూరగాయలు సాగు చేయడం వలన ఆరోగ్యంతోపాటు ఎక్కువ కాలం నిల్వ ఉండటంతో మార్కెట్‌లోనూ వీటికి డిమాండ్ ఉంది. గ్రామీణ ప్రాంతాలలో కూరగాయల పెంపకంపై మహిళలకు రైతు భరోసా కేంద్రాలకు చెందిన వ్యవసాయ సిబ్బంది సూచనలివ్వడం, విత్తనాలు అందించడం, సేంద్రియ పద్ధతిలో వ్యవసాయ సాగుకు అన్ని విధాల సహకారం అందిస్తున్నారు.



పెరటిలో సేంద్రియ పద్ధతిలో సాగులో ఉన్న టమాట

ఇంటి అవసరాలకు..



ఇంటి అవసరాల కోసం కొద్దిపాటి స్థలంలో కూరగాయలు పెంపకం చేపట్టాను. ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. స్థానిక వ్యవసాయ సిబ్బంది సలహాలతో మా పెరటిలో పూర్తిస్థాయిలో సేంద్రియ పద్ధతిలో వంగ, టమటా, అన్ని రకాల కూరగాయలు, తీగజాతి కూరగాయలు, పెంచుతున్నాను. మా ఇంటి అవసరాలకు సరిపోగా తక్కినవి విక్రయిస్తాను.

– షాకీర, గృహిణీ, చెన్నరాజుపోడు

ఆరోగ్యకరమైన కూరగాయలు పండిస్తాం



మా ఇంటి వెనుకభాగంలో ఉన్న ఖాళీ జాగాలో కూరగాయలు పెంచుతున్నాం. రసాయనాలు లేకుండా సేంద్రియ పద్ధతిలో కూరగాయలను సాగు చేసున్నాం. ఆరోగ్యకరమైన కూరగాయలు ప్రతినిత్యం ఇంటి వాడకానికి సరిపోగా తక్కినవి చుట్టు పక్కల వారికి, బంధువులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. ఇంటి అవసరాలకు రెండు సంవత్సరాలుగా అన్ని రకాల కూరగాయలు, ఆకు కూరలు పెరటిలో సాగు చేస్తున్నాం.

– నుంకేసుల అన్వర్ బాషా, చెన్నరాజుపోడు

సేంద్రియంతో సాగుకు సహకారం



పెరటి కూరగాయల సాగుకు మహిళలకు సేంద్రియ పద్ధతిలో సాగు చేసేందుకు అన్నివిధాల సహాయ సహకారాలు అందిస్తున్నాం. జీవామృతం, వివిధ రకాల కషాయాలు, ఇంటివద్దనే ఎలా తయారు చేసుకోవాలో వారికి శిక్షణ ఇస్తున్నాం. మహిళలు పెరటి సాగుపై మక్కువ చూపుతున్నారు. ఆసక్తి గల వారు ముందుకు వస్తే ప్రోత్సహిస్తాం. ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రతి ఒక్కటి వారికి అందిస్తాం.

– బుల్లయ్య, ఎంసీఏ, వ్యవసాయ శాఖ, చెన్నరాజుపోడు

జూదరుల అరెస్ట్

కలకడ : మండలంలో ఐదుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సిటిస్వామి తెలిపారు. వివరాలిలాఉన్నాయి. ఆదివారం మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ తోటిపల్లె సమీపంలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బంది శ్రీనివాసులు ,రాజేంద్రనాయక్, తాతయ్య, కాంతారావు, మునిరాజ, రమేష్, సంజీవతో కలిసి దాడులు నిర్వహించారు. జూదరుల నుంచి రూ.8,310 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కలికిరిలో..

కలికిరి: పేకాట ఆడుతున్న ఆరుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ లోకేష్ రెడ్డి తెలిపారు. మండలంలోని గుట్టపాళెం గ్రామం కె.బరిణేపల్లి సమీపంలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఆదివారం ఉదయం పోలీసులు దాడులు నిర్వహించి, ఆరుగురి వద్ద రూ.16,320 నగదు స్వాధీనం చేసుకున్నారు.

శిల్పారామంలో చిన్నారుల సందడి

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. స్థానిక చిన్నారులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. చిన్నచిన్న సరదా నాటికలతో అలరించారు.

ఇళ్ల నిర్మాణానికి ఇచ్చే ప్రోత్సాహకాన్ని పెంచాలి

రాజంపేట రూరల్ : జగనన్న కాలనీలలో గృహాల నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలని కోరుతూ చలో విజయవాడ నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మహేష్ తెలియజేశారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం సీపీఐ నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేద వాడికి సొంతింటి కలను సాకారం చేస్తూ జగనన్న కాలనీల నిర్మాణాలను చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం గృహనిర్మాణానికి అందజేసే రూ.1.80వేలుతో లబ్ధిదారులు గృహాలను నిర్మించుకోవడం కష్టంగా ఉందన్నారు. గత నెల 17నుంచి 30వరకు జగనన్న కాలనీలలో సీపీఐ బృందం పరిశీలించి వారికి ప్రభుత్వం అందజేసి ప్రోత్సాహకాన్ని రూ.5లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఇందుకుగాను ఈనెల 22న చలో విజయవాడ నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. సమావేశంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శులు ఎంఎస్ రాయుడు, ఎం.శివరామకృష్ణ దేవరా, పట్టణ కార్యదర్శి ఈ.సికిందర్, వెంకటేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహేష్

నైతిక విలువలతోనే సమసమాజ స్థాపన

రాజంపేట టౌన్ : ప్రతి మనిషి నైతిక విలువలు పాటించినపుడే సమసమాజ స్థాపన సాధ్యమవుతుందని జమా అతె ఇస్లామిక్ హింద్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎస్.మోహిద్దీన్ తెలిపారు. ఆ సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆయన సంస్థ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మనిషిలో నైతిక విలవలు, స్నేహభావం పెంపొందించేందుకు ఈ నెల 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు తమ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఓ ఉద్యమంలా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కొంత మంది దుష్టశక్తులు ప్రజల్లో విభజన తీసుకొచ్చేందుకు అలాగే విద్వేషాలు సృష్టించేందుకు యత్నిస్తున్నట్లు తెలిపారు. అలాంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు తాము ప్రజల వద్దకు వెళ్లి మానవులంతా ఒక్కటే, విభిన్న మనస్తత్వాల మానవుల సమూహమే సమాజం అన్న సందేశాన్ని తెలియజేస్తామన్నారు. మనిషికి నైతికతే ఉత్తమ ఆభరణం అన్నారు. కొందరు సోషల్ మీడియాను వేదిక చేసుకొని ప్రజల్లో అభద్రతా భావాన్ని, అశాంతిని పెంపొందిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఖాజపీర్, సయ్యద్ అస్లాం, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతన్న మోహిద్దీన్

శిక్షణా తరగతుల ఆకస్మిక తనిఖీ

సిద్దవటం : మండలంలోని పార్వతీపురం గ్రామంలో ఉన్న ఎస్. పి. బి. వి. డి సభా హైస్కూల్‌లో ఆదివారం జరిగిన ఓపెన్ స్కూల్ శిక్షణా తరగతులను కడప ఏపీ ఓపెన్ స్కూల్ సమన్వయకర్త కె.వి. సుబ్బారెడ్డి, అసిస్టెంటు కో–ఆర్డినేటర్ శివప్రసాద్‌లు శిక్షణా తరగతులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో క్లాసులు ప్రతి వారం జరుగుతున్నాయా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలోని 10వ తరగతి, ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్‌కు సంబంధించిన అడ్మిషన్ రిజిస్టర్‌లు, విద్యార్థుల హాజరును తనిఖీ చేశారు. అంతేగాకుండా ప్రీఫైనల్ పరీక్షలు జరిగిన సమాధాన పత్రాలను పరిశీలించారు. పాఠశాల కోర్డినేటర్ ఎం.డి. మధుసూదన్, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కె.వి. సుబ్బారెడ్డి

ఘనంగా తహలీల్ ఫాతెహా



ఎమ్మెల్యే నవాజ్‌బాషా, పీఠాధిపతి నూర్‌బాబాకు స్వాగతం పలుకుతున్న దర్గా కమిటీ సభ్యులు

మదనపల్లె సిటీ: స్థానిక బసినికొండలో వెలసిన బాబా హజరత్ అబ్దుల్ హుస్సేని దర్గా ఉరుసులో భాగంగా ఆదివారం తహలీల్ ఫాతెహా నిర్వహించారు. దర్గా పీఠాధిపతి నూర్‌బాబా మజార్లకు పూల చాదర్లు సమర్పించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే నవాజ్‌బాషా హాజరయ్యారు. దర్గా కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకి స్వాగతం పలికారు. దర్గాలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని దువా చేశారు. హిందూ, ముస్లింలు దర్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. దర్గాలో కళాకారులు ఖవ్వాలీ పాటలు ఆలపించారు. కమిటీ సభ్యులు రియాజ్, సర్దార్, షామీర్ పాల్గొన్నారు.

సాయిశతకం పుస్తకావిష్కరణ



సాయిశతకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

మదనపల్లె సిటీ: ప్రముఖ కవి, విద్యావేత్త డాక్టర్ బాడాల రామయ్య రచించిన సాయిశతకం పుస్తకాన్ని ఆదివారం స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని జ్ఞానోదయ పాఠశాలలో ఆవిష్కరించారు. ప్రముఖ రచయితలు రామయ్య రచించిన పుస్తకాన్ని పునర్ముద్రణ చేశారు. మదనపల్లె రచయితల సంఘం (మరసం) గౌరవ అధ్యక్షులు త్యాగమూర్తిశర్మ మాట్లాడుతూ రామయ్య తన 18 ఏటే 1944లోనే సాయి శతకం రాసి బాలకవిగా పేరుపొందినట్లు తెలిపారు. కొంత కాలం తరువాత ఆయన కుమారులు ముందుకు వచ్చి పునఃముద్రణ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సాహితీ కళావేదిక ఉపాధ్యక్షులు సుందరరామశర్మ, కవి కుమారులు శ్రీనివాసులు, నంజుడప్ప, నాగేశ్వరరావు, జ్ఞానోదయ పాఠశా కరస్పాండెంట్ కామకోటి ప్రసాదరావు, మునిగోటి కుమార్ పాల్గొన్నారు.

ఎస్ఈబీ దాడుల్లో 110 లీటర్ల సారా స్వాధీనం

మదనపల్లె : ఎస్ఈబీ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మదనపల్లె, నిమ్మనపల్లె మండలాల్లో విస్తృతంగా జరిపిన దాడుల్లో 110 లీటర్ల నాటుసారా స్వాధీనంతో పాటు ఒకరిని అరెస్ట్ చేసి మరొకరిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జ్ ఇన్స్‌పెక్టర్ శ్రీహరిరెడ్డి, ఎస్ఐ అంజాద్‌బాషా తెలిపారు. నాటుసారా రవాణా చేస్తున్న మేకలవారిపల్లె, వాల్మీకిపురం మండలంకు చెందిన కుక్కల గంగులప్పను అరెస్ట్‌చేసి 60 లీటర్ల నాటుసారా, సుజుకి యాక్సిస్ ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా అక్రమంగా 50 లీటర్ల నాటుసారా రవాణాచేస్తూ హోండా యాక్టివా ద్విచక్రవాహనాన్ని, సారాను వదిలి పారిపోయిన మేకలవారిపల్లె వాల్మీకిపురం మండలానికి చెందిన ఎస్.చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గర్నిమిట్ట యల్లమ్మకు బోనాల సమర్పణ



బోనాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో వెలసిన యల్లమ్మ తల్లికి పెద్ద ఎత్తున భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆదివారం యల్లమ్మ తల్లికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేశారు. గర్నిమిట్ట పరిసర గ్రామాల నుంచి భక్తులు మంగళ వాయిద్యాల నడుమ బోనాలు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆలయ చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గజ్జెల శృతి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల కన్వీనర్ గజ్జెల శీనీరెడ్డి, నాయకులు గౌస్, మహబూబ్‌బాషా, రమేష్, శశి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్లు

రాయచోటి అర్బన్ : స్థానిక లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం 28 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. లయన్స్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరానికి రాయచోటి, లక్కిరెడ్డిపల్లె ప్రాంతాలతోపాటు చుట్టుపక్కల నియోజకవర్గాల నుంచి కూడా 80 మంది కంటి రోగులు వచ్చారు. వీరికి కంటివైద్యులు సురేష్, భార్గవి, మహాలక్ష్మి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ రాజగోపాల్‌రెడ్డిలతో సిబ్బంది కంటి వైద్యపరీక్షలు చేశారు. వీరిలో వైద్యులు 28మందికి కంటి ఆపరేషన్‌లు అవసరమని గుర్తించి ఆపరేషన్లు జరిపారు. గతంలో ఆపరేషన్‌లు నిర్వహించుకున్న 40 మందికి ఈ సందర్భంగా వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి వారికి ఉచిత కంటి అద్దాలు, మందులు అందజేశారు. లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు చెన్నూరు అన్వర్‌బాషా, డిస్ట్రిక్ట్ చైర్మన్ శివరామిరెడ్డి, కంటి ఆసుపత్రి చైర్మన్ స్వరూప్ గుప్తా, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డితోపాటు వైద్యసిబ్బంది, రోగుల సహాయకులు పాల్గొన్నారు.



కంటిపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

విజేతలకు బహుమతుల అందజేత

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు మండలం మాధవరం పోడు గ్రామంలో క్షత్రియ వాలీబాల్ అసోసియేషన్ తరపున వేణుగోపాల్‌రాజు, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ముప్పాల హేమనవర్మ ఆధ్వర్యంలో జరిగిన వాలీబాల్ పోటీలలో విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. ఫైనల్ మ్యాచ్‌లో ప్రథమ స్థానంలో విజయవాడ జట్టు, ద్వితీయ స్థానంలో పాండిచ్చేరి జట్టు నిలిచాయి. విజేతలకు జెడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు విన్నర్ ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిగా రూ.70,116 , ద్వితీయ బహుమతిగా 40,116 రూపాయలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, రామరాజు, నాగేంద్రరాజు, సుదర్శన్‌రాజు, సుబ్బరామరాజు, తోట శివసాయి, వెంకటరెడ్డి, మల్లు అనిల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీ అందజేస్తున్న జెడ్పీచైర్మన్ ఆకేపాటి, ప్రభుత్వవిప్ కొరముట్ల

అసాంఘిక కార్యక్రమాలపై నిఘా

వాల్మీకిపురం : మండలంలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలపై నిఘా పెట్టాలని సీఐ సురేష్ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరిగితే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు.



మాట్లాడుతున్న సీఐ సురేష్

విశేష పూజలందుకున్న అమ్మవార్లు



సంబేపల్లె: దర్శనమిస్తున్న నల్లగంగమ్మ



పుల్లంపేట: ప్రత్యేక అలంకారంలో మేడాలమ్మ



లక్కిరెడ్డిపల్లె: పూజలందుకుంటున్న గంగమ్మ



చిన్నమండెం: దర్శనమిస్తున్న మల్లూరమ్మ



పెనగలూరు: పూజల్లో పాల్గొన్న కొరముట్ల, అజయ్‌రెడ్డి

సంబేపల్లె : మండల కేంద్రంలోని దేవరరాయి నల్ల గంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అర్చకులు, అభిషేకాలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

మల్లూరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం మాండవ్యానదిపై కొలువై ఉన్న మల్లూరమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మొక్కుబడులు తీరిన వారు అమ్మవారికి బోనాలు సమర్పించారు. బంధుమిత్రులతో కలిసి విందును ఆరగించారు. వచ్చిన భక్తాదులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను అందించారు.

లక్కిరెడ్డిపల్లిలో..

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన అనంతపురం గంగమ్మకు ఆదివారం భక్తులు ప్రత్యేక నిర్వహించారు. ఆదివారం కావడంతో వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మండలంలోని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. మండల ఉపాధ్యక్షుడు సమరసింహారెడ్డి, ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, సర్పంచ్ నారాయణ రెడ్డి, ఆలయ ఈఓ రవీందర్ రాజులు భక్తులకు సౌకర్యాలు కల్పించడంతోపాటు ఫిబ్రవరి 21, 22వ తేదీలలో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారి దర్శనం కోసం ఏర్పాటు చేసిన క్యూ లైన్‌లలో భక్తులు సౌకర్యార్థం ఈడిగపల్లికి చెందిన దాత మురికినాటి అరుణాచలం రూ. 3 లక్షలతో రేకులను ఏర్పాటు చేస్తుండటంతో ఆలయ కమిటీ వారిని అభినందించారు. కార్యక్రమంలో పూజారులు గంగయ్య, చంద్రారెడ్డి, శేఖర్, వేమయ్య, సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా మేడాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

పుల్లంపేట : మండల పరిధిలోని అనంతంపల్లి గ్రామంలో మూడురోజులుగా వేదపండితులచే మేడాలమ్మకు విశిష్ట పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆదివారం మేడాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం పూజారి శివశర్మ ఆధ్వర్యంలో చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారికి 41 రోజులపాటు అభిషేకాలు నిర్వహించనున్నట్లు పూజారి శివశర్మ తెలిపారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో ఎమ్మెల్యే కొరముట్ల, అజయ్ రెడ్డి

పెనగలూరు : మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో ఆదివారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డిలు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెనగలూరు గ్రామంలో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమానికి హాజరై అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించారు. అంతకుముందు నాయకులతో వారు ప్రత్యేకంగా సమావేశమై పలు అంశాలపై చర్చించారు. పలువురు నాయకులు వినతులను అందజేశారు. కార్యక్రమంలో సుబ్బనాయుడు, ముదిరాజ్ సంఘం రాష్ట్ర డైరెక్టర్ గుండ్లూరు ఈశ్వరయ్య, పెంచలకోన మాజీ డైరెక్టర్ గణపతిరెడ్డి రంగారెడ్డి, గడ్డమీద పెంచలయ్య, సిద్దవరం శ్రీనివాసులతోపాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.